
సత్యం

# కాలుతున్న పూలతోట

## నవల

సలీం

# కాలుతున్న పూలతోట

*('నవ్య' వారపత్రికలో ధారావాహికంగా వెలువడిన నవల)*

## సలీం

*ముద్రణ :* డిసెంబర్, 2006

*ప్రతులు :* 1000

*వెల :* రూ. 100/-

*ముఖచిత్రం :*
**బాపు**

*ప్రతులకు :*
**విశాలాంధ్ర బుక్‌హౌస్** – అన్ని బ్రాంచీలు
**నవోదయ బుక్‌హౌస్,** కాచిగూడ, హైదరాబాద్
**ప్రజాశక్తి బుక్‌హౌస్,** చిక్కడపల్లి, హైదరాబాద్.
**సలీం,** ఫ్లాట్ నెం. 306, జె.బి. అపార్ట్‌మెంట్స్,
దోమలగూడ, హైదరాబాద్.

*ముద్రణ :* **శ్రీ విజయలక్ష్మి పబ్లికేషన్స్,** ఏలూరు రోడ్, విజయవాడ.

# కాలుతున్న పూలతోట

***చె**న్నయ్‌లో జరిగిన మేనేజ్‌మెంట్ సదస్సులో పాల్గొని తిరిగొచ్చాక - రెండు వారాలు దాటినా ఆ జ్ఞాపకాలు మరపుకు రావటం లేదు.*

*మధురమైన జ్ఞాపకాలు . . . మెరీనా బీచ్‌లో మసక వెల్తురులో . . . జలతారు పరదాల రెపరెపల్లా కదుల్తోన్న అలల్ని చూస్తో . . . పడవచాటున కూచుని తన గొంతులోంచి జాలువారే తీయటి పాటను వింటో . . . అమ్మ ప్రేమలా కమ్మగా కురుస్తోన్న వెన్నెల తడి స్పర్శతో పాటు నన్నానుకుని కూచుని నా ఒడిలో ఒదిగిపోయిన ఆమె వెచ్చదనాన్ని అనుభవిస్తో . . . స్వర్గం ఎక్కడో లేదు - ఇక్కడే కదూ ఉందీ అని మురిసిపోతూ . . . అటూ యిటూ బెదురుగా చూసి . . . జన సంచారం లేనపుడు చప్పున ముద్దిడి . . . మైకంలా కమ్ముకొస్తున్న ఆ మాధుర్యాన్ని తట్టుకునే విఫలయత్నంలో ఓడిపోతూ . . .*

"వేడి వేడి పల్లీలు తిందామా" అంది.

"పల్లీలా . . . చిన్న పిల్లలం కాదుగా"

"భలేవాడివే . . . యిక్కడ పల్లీలు ఎక్కువగా తినేది ప్రేమికులే తెలుసా?"

"మనం ప్రేమికులమా?"

"ప్రేమికులైతే ఏంటట గొప్పా . . అవునూ - మనమూ ప్రేమికులమే. నువ్వు మజ్నూ, నేను లైలా . . . నువ్వు సలీం, నేను అనార్కలి . . . సరేనా" గలగలా నవ్వింది సెలయేరు మువ్వలు తొడుక్కున్నట్లు . . .

"వాళ్ళ ప్రేమలు విషాదాంతాలు"

"జీవితాలు విషాదంతో ముగుస్తాయేమో కానీ ప్రేమకు అంతమేమిటి? ప్రేమ అజరామరం. అందుకే వాళ్ళ ప్రేమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది. పోన్లే మరొకరితో పోలికెందుకు? మనకు మనమే సాటి".

నేనేమీ మాట్లాడలేదు.

తనే మరలా అంది "ఈ వెన్నెట్లో నీ కబుర్లని నంజుకుంటూ గరం గరం పల్లీలు తింటుంటే చాలా మజాగా ఉంటుంది"

పల్లీలమ్మే కుర్రాణ్ణి పిలిచి రెండు పొట్లాలు కట్టించి, ఒకటి నా చేతిలో పెట్టింది.

తినబోతుంటే – "నువ్వెక్కడ దొరికావయ్యా బాబూ . . . శుద్ధ బుద్ధావతారం. సరసం తెలీదు. చూడు మొద్దబ్బాయ్ . . . నా పొట్లంలోంచి నువ్వు తిను. నీ పొట్లంలోంచి నేను తింటాను" అంది.

"అదేమిటీ"

"అదంతే. అలా కాదంటే మరో మార్గం ఉంది. నీ పొట్లంలోది నాకు తిన్పించు. నా పొట్లంలోది నీకు తిన్పిస్తా. అప్పుడే మజా"

"ప్రతి దానికి మజా అంటావు నీ వూత పదమా" అన్నాను నవ్వుతూ.

"వూతపదం కాదు – జీవనవేదం లాంటి పదం. మజా లేకుండా ఎందుకు బతకటం? జీవితానికి అర్థం, పరమార్థం ఆ పదంలోనే ఉన్నాయి. మజా చేయాలి. ఎంజాయ్ చేయాలి. దొరికినంత సుఖాన్ని జుర్రుకోవాలి. దొరకని దాన్ని దోచుకోనైనా సరే అనుభవించాలి" నాకు మరింత దగ్గరగా జరిగి నా నడుం చుట్టూ చేయి వేసింది.

ఆమె ఎడమ వక్షం బిగుతుగా, బలంగా గుచ్చుకుంటోంది. నేను వివశత్వానికి లోనవుతూ . . . ఆమెను మరింతగా హత్తుకుంటూ . . .

ఆ సముద్రపు ఒడ్డున మేమిద్దరం తప్ప మరో నర సంచారం లేనట్లు . . . ఆ

తీరం మా ఆధీనంలో ఉన్నట్లు . . . దానికి రాజూ రాణీ మేమిద్దరమే అన్నంత అధికారంతో. . .స్వేచ్ఛతో . . .

ఆకాశంలో పొటమరించిన కాసిని నక్షత్రాలు సిగ్గుతో కళ్ళు వాల్చి – ఓరగా మా వైపు చూసి – చందమామ కోసం వెతుక్కుంటున్నాయి.

అలల లతాంగనలు తెల్లటి నురగల మేలి ముసుగుల చాటున ముసిముసిగా నవ్వుకుంటూ తీరం తాకి . . . మమ్మల్ని చూసి . . . మరింత ముడుచుకుపోయి వెనక్కెళ్ళిపోతున్నాయి. మరలా కుతూహలం చంపుకోలేక మరలి వస్తున్నాయి.

వెన్నెల మా మధ్య కాసింత చోటు కోసం ఇరుకున పడుతోంది.

మాకు సమయమే తెలీలేదు.

రాత్రి పదిగంటలు . . .

“ఆకలేయటం లేదా . . . భోజనం వేళ దాటిపోయింది” అన్నాను.

“నీ కౌగిళ్ళు చాలవూ . . . ఆకలెందుకు గుర్తొస్తుంది? మనసూ, తనువూ తృప్తితో నిండిపోతుంటేను” అంది వెన్నెల గిన్నెల్లాంటి కళ్ళతో నా మొహాన్ని తడుపుతూ . . .

“ఆకలేయటం లేదా? అలా కూచుండిపోయారు” ఆడగొంతు.

ఈ ప్రశ్న నేను కదా అడిగింది . . . మరి ఈ గొంతు?

ఆలోచనల్లోంచి బైటపడి తల తిప్పి చూశాను.

మాధురి . . .

“మిమ్మల్నే . . . తొమ్మిది దాటింది. పిల్లలు భోజనాలు చేసి పడుకున్నారు కూడా. అన్నం చల్లారిపోయి ఉంటుంది. వెచ్చబెట్టనా?”

మాధురి . . . నా వైపు అదోలా చూస్తూ . . .

నా భార్య . . . పదేళ్ళుగా నాతో కాపురం చేస్తున్న సహధర్మచారిణి.

'నాతి చరామి' అన్నాను కదూ . . . పెళ్ళప్పుడు ధర్మేచ, కామేచ, మోక్షేచ . . . నాతి చరామి . . . అని . . .

గిల్టీ ఫిలింగ్ . . . తప్పు చేశా కదూ . . . తప్పేనా . . . తప్పే . . . తప్పు కాకపోవటం ఏమిటి? భార్య ఉండగా మరో స్త్రీతో . . . పరాయి స్త్రీతో . . . సరస సల్లాపాలు వ్యభిచారం కిందికే వస్తాయి. చాలా ఘోరమైన తప్పు.

నాకు మాధురి అంటే చాలా యిష్టం. అనంతమైన ప్రేమ.

మాది పెద్దలు కుదిర్చిన వివాహం. అయినా తనని చూసిన క్షణం నుంచీ . . . తనని తాకిన మొదటి రాత్రి అనుభవం సాక్షిగా . . . బలంగా అల్లుకుపోయిన ప్రేమ.

మా యిద్దరికీ అది తొలిరాత్రి . . . తొట్రుపాటు – ఆందోళన – ఆరాటం – ఆవేశం – అనుభవ రాహిత్యం . . . ఎంత గొప్ప అనుభవం !

మాధురి నా ప్రేమ దేవత – అనురాగ దేవత – శృంగార దేవత కూడా . . .

చెన్నయ్ వెళ్ళినపుడు సుధీర కన్పించే క్షణం వరకూ నేనెవర్నీ కన్నెత్తి చూడలేదంటే దానిక్కారణం నా భార్య మాధురి. అనుకూలవతియైన భార్య – ఆదర్శ గృహిణి . . .

అటువంటి భార్యని మోసం చేసి . . . సుధీరతో . . . కామేచ నాతి చరామిని తుంగలో తొక్కేసి . . . ఛీ . . . నా మీద నాకే అసహ్యం వేస్తోంది. మాధురి కళ్ళలోకి సూటిగా చూళ్ళేకపోతున్నాను.

సుధీర కన్నా అందమైన అమ్మాయిలు ఎదురుపడినా చలించని నేను . . . అప్సరసల్లాంటి అతివలు వరించి వచ్చినా ప్రవరాఖ్యుడినేనని మాధురి దగ్గర గర్వంగా విన్నవించుకున్న నేను . . . సుధీరని చూడగానే సర్వం మర్చిపోయి . . . మత్తులో మునిగిన వాడిలా ఆమె కొంగు పట్టుకుని తిరగడానికి కారణం ఒక్కటే . . .

సుధీర నా ఫస్ట్ లవ్ . . .

కాలేజీ రోజుల్లో నేను గాఢంగా ప్రేమించిన అమ్మాయి.

అసలు యిన్నేళ్ళ తర్వాత సుధీర కన్పించటమే విచిత్రం.

దేవుడిచ్చిన వరంలా మెరీనా బీచ్‌లో నావైపుకు నడుచుకుంటో వచ్చిన సుధీర.

వరాన్ని కాదనుకునే అమాయకులుంటారా? అపురూపమైన అదృష్టాన్ని . . . నడుచుకుంటూ కాళ్ళ దాకా వచ్చిన అదృష్టాన్ని కాలదన్నుకునే మూర్ఖులుంటారా . . .

సుధీర ఒకప్పుడు నా ప్రాణంలో ప్రాణం – నా వూపిరిలో వూపిరి – నా శ్వాసలో శ్వాస . . .

ఇంటర్మీడియట్ నోటు పుస్తకాల నిండా నేను రాసుకున్న ఒకే ఒక పాఠం సుధీర.

హిమాలయాలకెళ్ళి తపస్సు చేస్తే సుధీర దొరుకుతుందని ఆ రోజుల్లో ఎవరైనా హామీ ఇచ్చి ఉంటే – తప్పకుండా వెళ్ళి ఉండేవాడిని. అంత పిచ్చి ప్రేమ.

క్లాస్‌రూంలో ఉన్నంతసేపూ సుధీరవైపు చూస్తూ కూచోటం –

బైటికొచ్చాక సుధీర యింటిఎదురుగా నిలబడి సెంట్రీ డ్యూటీ చేయటం . . .

అటువంటి సుధీర . . . ఇన్నేళ్ళ తర్వాత ప్రత్యక్షమై తన అందాన్ని ప్రసాదంలా నాకు అర్పిస్తానంటే . . . తన ప్రేమని పూవుల్లో పెట్టి నాకు వరంలా ఇచ్చేస్తానంటే . . . ఎలా కాదన్ను ?

తప్పే . . . భార్యని మోసం చేయటం తప్పే . . . కానీ తప్పు ఇంత మధురంగా ఉండేట్టయితే ఆ తప్పు చేయటంలో తప్పేంటి?

అన్నీ పుణ్యకార్యాలు చేసి – చనిపోయాక దొరికే స్వర్గం కన్నా – బతికున్నప్పుడే స్వర్గ ద్వారాల్ని తెరిపించే తప్పు తప్పు కాదేమో . . .

“మీరు మద్రాస్ నుంచి తిరిగొచ్చినప్పటి నుండి అదోలా ఉంటున్నారు. నాకు భయంగా ఉందండీ . . . మీ ఆరోగ్యం బాగానే ఉంది కదా”

నా నుదుటి మీద చేయి వేసి నా కళ్ళలోకి దిగులుగా చూస్తున్న మాధురి.

ఆ చేతి స్పర్శలో ఎంత ప్రేమ ! నన్ను నేను తడుముకున్నట్లు . . . నా గురించి నాకింత శ్రద్ధ ఉంటుందా . . . ఉండదు.

చప్పున నవ్వేశాను. మాధురి ప్రేమ . . . సుధీర సాంగత్యం. నేనెంత అదృష్టవంతుణ్ణో . . . ఆ ఆనందాన్నంతా వ్యక్తపరుస్తూ నవ్వాను.

"ఏం లేదు మధూ – నీకు చెప్పాగా – చెన్నయ్‌లో నా క్లాస్‌మేట్ సుధాకర్ కన్పించాడని . . . అతని జ్ఞాపకాలు . . . అంతే. ఇంటర్మీడియట్‌లో మేమిద్దరం బెస్ట్ ఫ్రెండ్స్. పరీక్షలయ్యాక సుధాకర్ వాళ్ళ నాన్నకు మద్రాస్ ట్రాన్స్‌ఫరైంది. అదుగో . . . ఆ తర్వాత మొన్ననే కల్సుకోవటం . . . కాన్ఫరెన్స్ పుణ్యమా అంటూ– దాదాపు పదిహేనేళ్ళ తర్వాత . . . "

"చిన్ననాటి స్నేహితుడు కల్సిన ఆనందంలో హుషారుగా ఉండాలి కానీ మూడీ అయిపోతున్నారెందుకండీ . . . మీరీమధ్య సరిగ్గా నిద్ర కూడా పోవటం లేదు"

"చానాళ్ళ తర్వాత కల్సుకున్నాం కదా. చెన్నయ్‌లో గడిపిన ఆ నాలుగు రోజులూ బాగా గుర్తొస్తున్నాయి అంతే"

"మీ స్నేహితుణ్ణి ఫ్యామిలీతో కలిసి హైద్రాబాద్ రమ్మని పిలవండి. మనింట్లో ఓ వారం రోజులుండి వెళ్తారు. అప్పుడుగానీ మీరు మామూలు మనిషి కాలేరేమో"

పెద్దగా నవ్వాను.

ఎంత అమాయకురాలు ! అతను స్నేహితుడు కాదని, స్నేహితురాలని తెలిస్తే ఏమంటుందో? ఎలా స్పందిస్తుందో? సుధాకర్ కాదు సుధీర అని తెలిస్తే . . .

మాధురి అపార్థాలు చేసుకునే రకం కాదు. సంస్కారవంతురాలు. సుధీర అని తెల్సినా మనస్ఫూర్తిగా పిలవమనే అంటుంది. నాపైన అంతటి నమ్మకం . . . ఏకపత్నీవ్రతుణ్ణని తన బంధువుల్లో చాలామందికి కాండక్ట్ సర్టిఫికెట్లు పంచింది.

ఎటొచ్చీ అది కేవలం స్నేహం కాదనీ, శారీరక సంబంధం కూడా అని తెలిస్తే . . . అమ్మో గుండె పగిలి చచ్చిపోతుంది.

నాది శారీరక సంబంధం మాత్రమేనా . . . కాదు. ఆత్మగతమైన అనుబంధం. సుధీర నా ప్రణయ దేవత. ఆమె విసిరే ఒక్క వాలు చూపు కోసం రోజుల తరబడి ఎదురు చూశా కదూ.

ఆ రోజుల్లో సుధీర కరుణించి ఉంటే మాధురి నా జీవితంలో ఉండేది కాదు. ఎన్ని అడ్డంకులొచ్చినా, హరిహరాదులడ్డుపడినా సుధీరని పెళ్ళి చేసుకుని ఉండేవాడిని.

అందంతోపాటు అహంకారం కూడా ఆమె సొత్తే. పేరుకు తగ్గట్టుగా ధీర వనిత. ఎవర్నీ లెక్క చేసేది కాదు. ఎంతటి అందగాడు వెంటపడినా తిరస్కారాన్ని వాడి మొహాన విసిరికొట్టేది. సుధీర అంటే కుర్రవాళ్ళలో పిచ్చి ఆకర్షణ పెరగడానికి అదీ ఒక కారణమే.

నేనో రోజు ధైర్యం చేసి లవ్‌లెటర్ రాశా. దాన్ని పుస్తకం మధ్యలో పెట్టి యిచ్చా. క్రితం రోజు ఆమె దగ్గర అడిగి తీసుకున్న పుస్తకం.

"యింటికెళ్ళాక అందులో ఇరవై ఆరో పేజీ చూడు" అన్నాను.

"లవ్ లెటరా?" అంది.

అంత సూటిగా అడిగేప్పటికి సమాధానం ఏం చెప్పాలో తెలీక తడబడ్డాను.

"యింటికెళ్ళే వరకూ ఆగడం దేనికి? ఇప్పుడే చదువుతాను" అని ఉత్తరాన్ని తీసి అక్కడే నిలబడి చదివింది.

పరీక్ష రాశాక రిజల్ట్స్ కోసం ఉత్కంఠతో ఎదురుచూసే విద్యార్థిలా నేనామెవైపు ఒకింత ఆశగా, మరింత భయంగా చూశాను.

ఆమె తలయెత్తి, అరచేయంత వెడల్పున్న కాటుక కళ్ళ రెప్పలాడించి నవ్వింది. ఒక్కసారిగా నా చుట్టూ వసంతనృత్యహేల . . . వెన్నెల వరద . . .

ధైర్యం వచ్చింది.

**End of Preview.**

**Rest of the book can be read @**

http://kinige.com/kbook.php?id=182